
# చట్రాలు

పాలడుగు వెంకటేశ్వరరావు



తెల్లచొక్కా, ఖాకీ పాంటూ ధరించి నడిచి వస్తూ నాకు ఎదురయాడు అతను. అతని మొహం గంభీరంగా వుంది. కోర మీసాలు. జుట్టు అక్కడక్కడా నెరుస్తూ వుంది. నిరాడంబరంగా వున్నాడు.

'ఎక్స్క్యూజ్మీ' అని అతన్ని ఆపి పలకరించాను.

అతను ఆగాడు.

'రావ్ అండ్ రావ్ కంపెనీ ఆఫీసు ఎక్కడో చెపుతారా ?' అని అడిగాను.

'ఎందుకండీ ?' అని మర్యాదగానే అడిగాడు అతను. నాకు కోపం వచ్చింది.

'అది మీకు అనవసరం' అన్నాను దురుసుగా.

షాక్ తిని, అతను తెల్లబోయాడు—కొన్ని క్షణాలలో తెప్పరిల్లాడు.

'నేను అక్కడికే వెడుతున్నాను. కావాలంటే రండి నా వెంట' అన్నాడు.

'నాకు వేరే పనుంది. నేను మీ కూడా రాలేను. తరువాత టాక్సీలో వస్తాను గాని ఆ ఆఫీసు ఎక్కడుందో చెప్పండి' అన్నాను, స్టయిల్‌గా.

'ఆ జంక్షన్‌లో కుడివయిపుకి తిరిగి చివరదాకా వెళ్ళాలి' అన్నాడు.

'అలాగా ! ఎంత దూరం వుంటుంది ?' అన్నాను.

'ఒక మయిలు దూరం వుండవచ్చు.'

'మరి నడిచి వెడుతున్నారేం?' అనవసరపు ప్రశ్న అని నాకు తెలుసు.

'నడవటం నాకు అలవాటు' అని నవ్వాడు అతను. నాకు తెలుసు. జేబులో డబ్బులులేని పెద్ద మనుషులు తమ లేమిని ఆ రకంగా కప్పిపుచ్చుకోవటాన్కి తంటాలు పడతారు. ఈయనా ఆ రకం మనిషే కావచ్చును. గలగల నవ్వాను. నాలో క్రూరతనం పూర్తిగా పోలేదు. అతను కంగారుపడ్డాడు.

'మీరు ఏం పనిమీద అక్కడికి వెడుతున్నారో నేను తెల్సుకోవచ్చునా ?' అన్నాను.

'నేను అక్కడ పని చేస్తున్నాను,' అన్నాడు.

'గుమాస్తాగానా ?' అప్రయత్నంగానే వచ్చింది ఆ ప్రశ్న. ఆ ప్రశ్నలో తొందరపాటుతనంవుంది. అంత పెద్ద కంపెనీలో పని చేస్తూ నడిచి వెళ్ళటం అలవాటు పడిన ఆ మనిషి అంతకంటే పెద్దవుద్యోగం చేస్తూ వుంటాడని నేననుకోలేకపోయాను.

'కాదండీ' అన్నాడు.

'ఎకౌండరుగానా ?' అతన్ని ఓవర్ ఎస్టిమేట్ చేసానేమోనన్న అనుమానం వచ్చింది నాకు. నేను పెళుసుగా అన్నమాట వాస్తవం.

అతను తెల్లపోయాడు.

నాకు నవ్వు వచ్చింది. నవ్వాను. క్రూరతనం !

'నాకు టయిమవుతూందండి. నేను వస్తాను' అని సాగిపోబోయాడు.

'ఒక్క నిముషం ఆగండి' అన్నాను.

అతను ఆగాడు.

'ఈ వూళ్ళో ఎటాచ్‌డ్ బార్ వున్న మంచి హోటల్ పేరు చెప్పగలరా ?'

'నాకు తెలీదండి' అన్నాడు, సిగ్గుపడి తల వంచుకుని అతను.

'పోనీ కాబరే ఆడించే హోటళ్ళు మీకు తెలుసా ?'

'అదీ తెలీదండి.'

'ఏమీ తెలీకుండా ఈ వూళ్ళో ఎలాగ వుంటున్నారండి బాబూ !?' అన్నాను నిష్ఠురంగా. అతని మెతకదనం నాలో చిరాకు తెప్పించింది. మీదపడి నాలుగు గుద్దాలనిపించింది. అతను తెల్లపోయాడు.

'ఇక వెళ్ళివస్తారా?' పరిహాసంగా అన్నాను. రావ్ అండ్ రావ్ కంపెనీలో పనిచేస్తూవున్న ఇటువంటి మానవుడు నాకు తొలిసారిగా పరిచయం అవటం చాలా చికాకనిపించింది.

రావ్ అండ్ రావ్ కంపెనీ దేశంలోనే పేరుమోసిన సంస్థ. డిగ్రీ పూర్తి చేసి లైఫ్‌ని ఎంజాయ్ చేయటం మరిగిన (?) నా కాళ్ళకి సంకెళ్ళు బిగించటంకోసమని కోటీశ్వరుడయిన మా 'బాబు' పెద్ద రికమండేషన్ లెటరుతో ఆ కంపెనీలో అప్రెంటిస్ ఆఫీసరుగా చేరమని పంపించాడు నన్ను. పెద్దనాడు. ఆయన మాటెందుక్కాదనాలని, ఆ వూరు వచ్చి నాలుగు రోజులయినా ఆ నాల్రోజులూ బిజీగా గడిచిపోయాయి. చివరికి బిజినెస్‌లో పడదామని ఆ రోజే శుభముహూర్తం చూసుకుని రోడ్డువెంట పడ్డాను. కారు ట్రబులిచ్చింది. వదిలేసాను. పదాతిబలం. ఆ మానవుడ్ని అలా వదిలేసి – ఊర్వశి ఎ. సి. రూంలో కాఫీ తాగి టాక్సీలో కంపెనీకి వెళ్ళాను. నేనాశించినట్లుగానే కంపెనీ మూడంతస్థుల పెద్ద భవనంలో వున్నది. ఎయిర్‌కండిషన్డ్ ! రిసెప్షన్ రూంలో ఫేషనబుల్ బాబ్డ్ హెయిర్డ్ గాల్సు నాకు స్వాగతం చెప్పారు. కళ్ళుతిరిగి పడబోయి తమాయించుకుని ఒక రిసెప్షనిస్ట్, దారి చూపగా చేర్మన్‌గారి గదిలోకి చొరబడ్డాను.

తలొంచుకుని కాగితాలు చూసుకుంటున్న ఆ శాల్తీకి నమస్కారపూర్వకంగా విష్ చేసి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాను – దర్జాగా.

కాసేపయాక ఆయన తలెత్తి 'ఎస్. ప్లీజ్' అన్నాడు.

స్తన్నుయిపోయాను.

ఆ పెద్దమనిషి - ప్రొద్దుట బజారులో ఎదురయి, నావల్ల పరాభవింపబడిన శాల్త్రియే. కంగారు నణచుకుని మా నాన్న ఇచ్చిన లెటరుని ఆయనకి అందించాను.

అది చదువుకుని చిరునవ్వు నవ్వుతూ — తలెత్తి — అతను —

ఆ నవ్వుకి నా వంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకినట్లయింది. నన్ను తీసుకెళ్ళి సల సల మరుగుతూన్న నీటిలో పడేసినట్లయింది. నా వళ్ళంతా చమటలు పట్టింది. నాకు తెలుసు — అతని చూపులు నా శరీరాన్ని చీల్చి నా మనసులోకి చొచ్చుకుపోతున్నాయి. ఇంత పరాభవం నా జీవితంలో ఎరుగను. డామ్ లీ థింగ్ !

— 'ఆర్డర్సు తీసుకుని వెంటనే డ్యూటీలో చేరుతారా ?' అన్నాడు.

'ఉహుఁ' అన్నాను విసురుగా.

'కష్టపడి పనిచేసిన మీవంటి యువకుల వలననే ఈ కంపెనీ ఇంత పైకి వచ్చింది. అందువలన మీవంటి యువకులకు ఈ కంపెనీ ఎప్పుడూ స్వాగతం పలుకుతుంది.' అన్నాడు, అతను ప్రొఫెషనల్ టోన్‌లో.

నాలో అసహనం పెల్లుబికింది. 'మీరు మనస్ఫూర్తిగా అలా అంటున్నారని నేననుకోను. మీరు ఎందుకు అలాగ మాట్లాడుతున్నారో నేను తెలుసుకోవచ్చా ? సూటిగా స్పష్టంగా చెప్పండి' అన్నాను పెళుసుగా, ధ్రైర్యంగా.

'మీ ఫాదర్ ఈ కంపెనీలో ఒక పవర్‌ఫుల్ డైరెక్టరు కావటంవల్లన' అని సూటిగానే జవాబు వచ్చింది. ఆ జవాబు ననుసరించి వచ్చిన ఆ నవ్వు!

'నా గురించి మీరు దయతో వెలిబుచ్చిన అభిప్రాయం నిజంగానే మీ గుండెల్లోంచి వచ్చిందనుకోమంటారా ?'

'కాదు.'

'మరెందుకా ఆత్మవంచనా ?'

'కాదు. అది నా వుద్యోగ ధర్మం అని నేనంటాను.'

'నాలాంటివాడు ఈ కంపెనీలో చేరితే నిజంగా అది కంపెనీకి వుపయోగకరమని గుండెమీద చెయ్యేసుకుని చెప్తున్నారా ?'

'లేదు. మీరు ఈ కంపెనీలో చేరిన



తక్షణం నేను రిజయినిచ్చి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాను.'

'కారణం నేను తెలుసుకోవచ్చా ?'

'మీరు తెలుసుకోవచ్చేమోగాని నేను చెప్పటానికి సిద్ధంగా లేను.' - నవ్వు.

'కారణం ?!'

అతను నవ్వాడు.

నేను అవమానంతో చితికిపోయాను. నా మొహం ఎర్రగా అయింది.

టెన్షన్ తగ్గించుకొనటానికి త్రీఫైవ్స్ పాక్‌లోంచి ఒక సిగరెట్ తీసి వెలిగించుకోబోయాను.

'నో స్మోకింగ్ ప్లీజ్. అక్కడి బోర్డు మీరు చూడలేదనుకుంటాను.' మర్యాదగానే.

'సారీ'

'క్రమశిక్షణ ఈ కంపెనీకి ప్రాణం. మంచి ఆరోగ్యం గల వుద్యోగులు ఈ కంపెనీకి నరాలు. పొదుపు ఈ సంస్థ మొదటినుంచీ అనుసరిస్తూవున్న పద్ధతి' అన్నాడు. లెక్చరు!

'వెరీగుడ్. అంత మాత్రాన ఇంత పెద్ద బిల్డింగూ, ఈ ఏ. సీ. ఫెసిలిటీసూ, ఈ సోఫాలూ ఈ దర్జా ఇవన్నీ వుండాల్సింది గాదేమో అని నేననుకోవచ్చునా ?'

'అనుకోవటానికి అభ్యంతరం లేదు. కంపెనీ స్టేటస్‌నిబట్టి ఇవన్నీ వుండకతప్పవు కాని అంతర్గతంగా నిలద్రొక్కుకుని కంపెనీని పైకి తీసుకుపోతూవున్నవి పై సూత్రాలే! కంపెనీలాగే నేనుకూడా క్రిందనుంచి పైకి వచ్చినవాణ్నే. అందువలన నేల విడిచి సాము చేయడం నా కిష్టంలేదు —'

ఆయన ఆగాడు.

ఆయన కోసం ఎదురుచూస్తూ టేబులు మీద చాలా కాగితాలు ఎదురుచూస్తున్నాయి. అప్పటికే నా గురించి ఆయన చాలా సమయం వెచ్చించాడు.

'అయాం సారీ' అన్నాను తలవంచుకుని

'మరేం ఫర్వాలేదు. మీరు చేరిపొండి నేను డైరెక్టర్సుతో మాట్లాడి వెంటనే ఛార్జి రిలింక్విష్ చేస్తాను' అన్నాడు. అని నవ్వాడు, మెత్తగా.

అవమానంతో నా మొహం ఎర్రనయింది

'మీకు ఆ అవసరం లేదు. ఈ కంపెనీ బాగుని కోరే వాళ్ళలో నేనూ ఒకణ్ణి. అందులో నా స్వార్థమూవుంది. అందువలన—'

'మీరంటున్నది ఏమిటి ?' — అతని కళ్ళలో ఆశ్చర్యం !

'మీరు పెద్దవారు. థాంక్యూ వెరీమచ్ ఇంకా నన్నవమానించటానికి ప్రయత్నించకండి. నాకు అసలే టెంపరమెంట్ ఎక్కువ. ఇంతవరకు మన మధ్యన జరిగింది చాలు.'

నేను లేచాను.

'అయాం సారీ మిస్టర్. మిమ్మల్నవమానించాలని నా వుద్దేశ్యం కాదు.'

'మీరు కాదని నాకూ తెలుసు. నా ప్రవర్తనే నన్ను అవమానించిందనీ నాకు తెలుసును. నాలాంటివాళ్ళు ఇటువంటి చట్రాలలో ఇమడటం చాలా కష్టం అందుకే నేను వెనక్కి వెళ్ళిపోతున్నాను. ఒ. కే. ఆల్ ది బెస్టు టూ యూ అండ్ ది కంపెనీ.'

నేను లేచి వచ్చేసాను.

నా మనసు అప్పటికిగాని తేలిక పడింది గాదు ! ★

## భయంనుంచి 'చక్కెర' !

భయం పెక్కు వ్యాధులకు మూల కారణమని పశ్చిమ జర్మనీ శాస్త్రవేత్త డా॥ అకిమ్ రీండల్ తెలియజేస్తున్నారు. భయం చక్కెర వ్యాధిగా మారవచ్చు. భయంవలన రక్తపీడనం, గుండెజబ్బులు రావచ్చు. భయమనేది మానసికలోపమే. అయినా యిది శారీరక వ్యాధిగా మారటానికి చాలా అనకాశాలున్నట్లు ఆయన తెలియచేశారు. మరో శాస్త్రవేత్త వుల్ఫ వోల్కర్‌లిండ్నర్ భయాన్ని గురించి వివరిస్తూ, భయం నిత్య జీవితంలో అనేక సమస్యల్ని సృష్టిస్తుందని తెలియచేశారు. మరో శాస్త్రవేత్త ప్రొ. హీగల్ ఈవర్స్ ప్రముఖ మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్‌ని వుదహరిస్తూ, భయం మానసిక శక్తిని దూరం చేస్తుందని తెలియచేశారు. ఒక ఉద్దేశ్యాన్ని లేక అనుభవాన్ని అణచి వుంచడంవలన భయం ఏర్పడుతుంది. అయితే అదే సమయంలో భయంవలన నీటిని అణచి వుంచడానికి ప్రయత్నించడం జరుగుతుంది.